పుస్తక పరిచయం

# ‘అమెరికా వారి ఒక ప్రశ్నావళికి నా జవాబు’

ప్రస్కోవ్యా ఏంజెలినా

**ఒక** నిరుపేద రైతు కుటుంబంలో జన్మించి, కులక్‌ల (భూస్వాముల) పొలాల్లో వ్యవసాయ కూలీగా పనిచేసే యువతి, ప్రస్కోవ్యా ఏంజెలినా. రష్యన్ అక్టోబర్ విప్లవ విజయానంతరం, సోవియట్ ప్రభుత్వం చేపట్టిన సమిష్టి వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తూ, ట్రాక్టరు డ్రైవరుగా శిక్షణ పొందిన రష్యా మొదటి మహిళ.

స్త్రీలు ట్రాక్టర్ డ్రైవింగ్ చేయటానికి పనికిరారనీ, అది వారికి సాధ్యంకాని పని అనీ, తీరా ట్రాక్టర్ డ్రైవర్‌గా శిక్షణపొంది తన గ్రామ సమిష్టి వ్యవసాయక్షేత్రంలో పని (ట్రాక్టర్ డ్రైవర్‌గా) చేయబోతే, ఆమెను గ్రామప్రజలు గేలి చేసి అడ్డుకొంటారు. అయితే ఆ అడ్డంకిని తప్పించుకొని ఆమె పనిలోకి దిగి, ట్రాక్టర్‌ను తోలటానికి మహిళలు అన్నివిధాలా సమర్ధులేనని నిరూపిస్తుంది. అంతేగాక పార్టీ వారిని ఒప్పించి, తన గ్రామం నుండి ఎంపిక చేయబడ్డ కొందరు యువతులకు ట్రాక్టర్ డ్రైవింగులో శిక్షణ యిప్పించి, దేశంలోని మొట్టమొదటి మహిళా ట్రాక్టరు డ్రైవర్ల దళాన్ని తయారుచేస్తుంది.

తిరిగి ఆమెకు జరిగినట్లే , ఆ ఊరిలోని ప్రజలు, ఆ మహిళా దళం ట్రాక్టర్లను నడపకుండా అడ్డుకొన్నారు. ట్రాక్టరు విభాగ మేనేజర్ మహిళలకు యిచ్చి ట్రాక్టర్లను అవి పాడయి పోవటానికి (మహిళలు సక్రమంగా తోలలేరు కనుక)) వాటిని ఆ దళంకు అప్పగించ నిరాకరిస్తాడు. అప్పుడు పార్టీ నాయకత్వం కలుగ జేసుకొని మహిళా డ్రైవర్లకు ట్రాక్టర్లు యిచ్చి, వారిచేత సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో ఆ మహిళా డ్రైవర్లు పనిచేసేటందుకు వీలు కల్పిస్తారు.

సోవియట్ యూనియన్ పునర్నిర్మాణంలో సమిష్టి వ్యవసాయ క్షేత్రాల పాత్ర గణనీయమైనది. అంతవరకూ కేవలం ప్రకృతి దయాదాక్షిణ్యాల మీదనే నిర్వహింపబడే వ్యవసాయం, సోవియట్ ఆధ్వర్యంలో శాస్త్రీయ వ్యవసాయ పద్ధతుల ద్వారా నిర్వహింపడింది. అతి గరిష్ట వ్యవసాయోత్పత్తినీ సాధించింది. ఈ ప్రక్రియలో ట్రాక్టర్లు వ్యవసాయ సాధనాలుగా నిర్వహించిన పాత్ర అమోఘమయినది. ఆ ట్రాక్టర్లను నడిపిన, వ్యవసాయాన్ని అభివృద్ధిచేసిన మహిళా ట్రాక్టర్ డ్రైవర్ల పాత్ర అమోఘమయినది.

తాను జీవితాంతం ట్రాక్టరు డ్రైవరుగానే పనిచేస్తూ పంటల ఉత్పత్తిలో గణనీయమైన లక్ష్యాలను చేరుకోవటం కోసం అహర్నిశలూ కృషిచేసిన ఏంజెలినా, 1937లో కమ్యూనిస్టుపార్టీ సభ్యురాలైంది. ఆమె భూసంబంధ ఉద్యోగుల యూనియన్ సభ్యురాలైంది. 1938లో ఆమె ‘నా దళం’ అనే పుస్తకాన్ని ప్రచురించింది. వార్తా పత్రికలలో అనేక వ్యాసాలను వ్రాసింది. ఆమెకు సైన్యం ‘గార్డ్స్‌మన్’ అనే బిరుదునిచ్చింది. ఆమె సోవియట్ యూనియన్ యొక్క సుప్రీం సోవియట్‌కు (అత్యున్నత శాసనసభకు) రెండుసార్లు డిప్యూటీగా (పార్లమెంటు సభ్యురాలుగా ఎన్నుకోబడింది). ఆమెకు ‘హీరో ఆఫ్ ది సోషలిస్టు లేబర్’ అనే బిరుదు యిచ్చారు. ఆమెకు స్టాలిన్ బహుమానం యిచ్చారు. రెండుసార్లు ‘ఆర్డర్ ఆఫ్ లెనిన్’ బహుమతినిచ్చారు. అదేవిధంగా ఆమెకు ‘ఆర్డర్ ఆఫ్ రెడ్ బ్యానర్’ను యిచ్చారు. ఇవిగాక ఆమెకు ఎన్నో పతకాలు వచ్చాయి.

అయితే ఆమె యింత అత్యున్నత స్థాయికి చేరుకోవటానికి – ఒక నిరక్షరాస్యురాలైన వ్యవసాయ కూలీ నుండి, అత్యున్నత స్థాయి సోవియట్ శాసనసభ్యురాలు అవటం ఎలా జరిగింది? ఏయే పరిస్థితులు, కారణాల వలన ఆమె ఆ స్థాయికి ఎదిగింది అన్నది ప్రధానమైన, కీలకమైన ప్రశ్నగా వుంటుంది. విప్లవం విజయవంతమై, కార్మికవర్గ ఆధిపత్యాన బోల్షివిక్‌లచే సోషలిస్టు సామాజిక వ్యవస్థ నెలకొల్పబడి, అది అందించిన అవకాశాల వల్లనే కేవలం యిటువంటివి సాధ్యం! అన్నదే యిందుకు జవాబుగా వుంటుంది.

పెట్టుబడిదారీ దేశాలలోని వ్యక్తుల మాదిరి కేరీరిజంతో వ్యవహరించటం వలన ఆమె ఉన్నత స్థితికి చేరుకోలేదు. పెట్టుబడిదారీ దేశాలలో నూటికో – కోటికో మాత్రమే అటువంటిది సాధ్యమయ్యేటట్లు సోవియట్ సామాజిక వ్యవస్థ నిర్వహింపబడలేదు. ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించింది. సోవియట్ యూనియన్‌లో వందల, వేలమంది ఉన్నతస్థాయికి చేరుకోవటం సంభవించింది.

ప్రమోషన్ వస్తే తప్ప, చేస్తున్న వృత్తిలోనే మిగిలిపోతే గుర్తింపు వుండదనే అభిప్రాయాలను తప్పుడు అభిప్రాయాలుగా ఏంజెలినా తేటతెల్లం చేసింది. అనేక సందర్భాలలో ప్రమోషన్లు యిస్తామన్నా, ఉన్నత పదవులు యిస్తామన్నా నిరాకరించి, సోషలిస్టు వ్యవస్థలో ఏ ఉద్యోగమైనా, ఏ పదవి అయినా సమానమైనవేనని ఆమె తన అనుభవం ద్వారా నిరూపించింది.

హిట్లర్ నాజీ సైన్యం సోవియట్‌పై దండయాత్ర చేసి, దురాక్రమణ యుద్ధం జరిపిన సందర్భంలో పార్టీ పిలుపు మేరకు తాను నివసిస్తున్న సస్యశ్యామలంగా తయారుచేయబడ్డ ఉక్రెయిన్ ప్రాంతం నుండి, తీవ్రమయిన మంచుతో పంటలు పండని కజకస్థాన్ ప్రాంతానికి తన దళంతో తరలివెళ్ళింది. అక్కడ పంటలు పండని ప్రాంతంలో, తాను గడించిన అనుభవంతో, ఆ ప్రాంతంలో శాస్త్రీయ పద్ధతుల ద్వారా పంటలు పండించి, ఆహారాన్ని ఉత్పత్తి గావించి, పోరాడుతున్న సైనికులకు ఆహారాన్ని అందే

ఏర్పాటు చేయటం ద్వారా, యుద్ధంలో ఆహారం కూడా ఒక ఆయుధమే! అన్న విషయాన్ని నిరూపించింది.

హిట్లర్ వ్యతిరేక యుద్ధకాలంలో ఆమె కుటుంబ సభ్యులు అష్టకష్టాలను (యితరుల వలెనే) అనుభవించారు.

ఆమెకు నేరుగా స్టాలిన్‌తో పరిచయమయ్యింది. ఆమె సుప్రీం సోవియట్ జర్మని వ్యతిరేక యుద్ధం సాగిస్తున్న కాలంలో జరిపిన సమావేశానికి హాజరయింది. సోవియట్ యూనియన్ యొక్క రాజ్యాంగాన్ని ఆమోదించటానికి స్టాలిన్ ఆధ్వర్యాన నిర్వహింపబడ్డ ఎనిమిదవ అసాధారణ కాంగ్రెసుకు ప్రతినిధి. స్టాలిన్ వ్రాసిన బోల్షివిక్ పార్టీ స్థూల చరిత్ర అన్న గ్రంథంలో, స్టాలిన్ ఈమెను ప్రశంసిస్తూ పేర్కొంటాడు.

అటువంటి ఈమెకు న్యూయార్కుకు చెందిన 'ప్రపంచ జీవిత చరిత్రల ఎన్‌సైక్లోపీడియా'ను ప్రచురించే ప్రచురణ యొక్క సంపాదకుడు ఒక ఉత్తరం వ్రాస్తూ, తాము ప్రఖ్యాతి చెందిన వ్యక్తుల జీవిత చరిత్రలను తమ ఎన్‌సైక్లోపీడియాలో ప్రచురిస్తున్నామనీ, అటువంటి ప్రఖ్యాతి చెందిన వ్యక్తులలో ఒకరిగా, ప్రస్కోవ్యా ఏంజెలినాను ఎంచుకొన్నామనీ చెబుతూ ఆ ఉత్తరంతోపాటు ఒక ప్రశ్నావళిని పంపుతూ అందుకు జవాబులు యివ్వమని కోరతాడు. అయితే, ఆ ప్రశ్నావళిలో ఏయే సామాజిక పరిస్థితుల కారణంగా ఆమె అంతటి స్థాయికి చేరుకోగల్గింది? అన్న ప్రశ్న తప్ప, అనవసరమైన అనేక వివరాలను అడుగుతున్న ప్రశ్నలు వున్నాయి.

అప్పటికే యుద్ధంలో స్టాలిన్ నాయకత్వాన సోవియట్ యూనియన్ నాజీలను, హిట్లర్ సైన్యాన్ని ఓడించి, తుద ముట్టించింది. ఇక యుద్ధం కాదు–శాంతి కావాలని కోరుతూ ఐక్యరాజ్యసమితిలో సోవియట్ ప్రతినిధి పదేపదే ప్రకటిస్తున్నాడు.

అయినా అటు అమెరికా పాలకులూ, యిటు బ్రిటన్ (ఇంగ్లండు) పాలకులూ, పలువురు రాజనీతిజ్ఞులూ సోవియట్ యూనియన్‌పై ఆటంబాంబులు వేసి, ధ్వంసం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఆమె ఆ అమెరికన్ ప్రశ్నావళికి జవాబుగా, ఒక చిన్న పుస్తక రూపంలో జవాబునిచ్చింది.

ఆ ప్రశ్నావళిలో "మీరు మీ దేశంలో ఎవరిని అత్యంత ప్రముఖులుగా భావిస్తారు?" అన్న ఒక ప్రశ్న వుంది.

అందుకు ఆమె యిచ్చిన జవాబు: సోవియట్ యూనియన్‌లో 2 కోట్లమంది ప్రజలందరూ అత్యంత ప్రముఖులే!

ఈ జవాబును బట్టే ఒక సోషలిస్టు సమాజంలోని ప్రజల ఆలోచనా స్వభావానికీ, సోషలిస్టేతర ప్రపంచంలోని ప్రజల ఆలోచనా స్వభావానికి గల తేడా మనకు స్పష్టంగా బోధపడుతుంది.

అనేక వివరాలతో నాటి సోవియట్ దేశ ప్రజల స్థితిగతులను, సోవియట్ ప్రభుత్వం దేశ పునర్నిర్మాణానికి చేబట్టిన విధానాలనూ, వాటి స్వభావాలను ఒక చిన్న పుస్తకరూపం ద్వారా, ప్రపంచ ప్రజానీకానికి అందించింది ప్రస్కోవ్యా ఏంజెలినా!

ఇది ఎంతో స్ఫూర్తిదాయకంగా అందరూ, ప్రత్యేకించి మహిళా సమస్యలపై పనిచేస్తున్న కార్యకర్తలు చదవవలసిన పుస్తకంగా వుంది. సోవియట్ వ్యవస్థను గురించిన యదార్థ వివరాలు తెల్సుకోవటానికి యీ చిన్న పుస్తకం దోహదకారిగా వుంటుంది! ఈ పుస్తకాన్ని 1949లో ప్రచురించారు.

★★★★★